క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



రామాల శ్రీనును పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : మండలంలో గల నామవరం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు రామాల శ్రీనును నాయకులు పరామర్శించారు. రామాల శ్రీను తల్లి ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా నామవరం వెళ్లి రామాల శ్రీనును పరామర్శించారు. వీరితో పాటు పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మండల బీసీ సెల్ అధ్యక్షుడు లోవకుమార్, పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు, పార్టీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, తూము రమణ తదితరులు శ్రీనును పరామర్శించారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య సురక్ష



చినబొడ్డేపల్లిలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు, పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కోటవురట్ల : ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్ పైల శివరాం అన్నారు. చిన బొడ్డేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, సర్పంచ్ శివరాం వైద్య శిబిరాన్ని ప్రారంభించగా స్థానిక వైద్యులతో పాటు ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. పోషకాహారం ఆవశ్యకతను వివరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతల సత్తిబాబు, అవుగడ్డి దుర్గా రాజీవ్, వైద్య ఆరోగ్య, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ



మూలపేటలో పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక:రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. రైతులకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూలపేటలో శనివారం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ సురక్షలో భాగంగా అర్హులైన రైతులకు పట్టాదారు పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం రీ సర్వేను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులకు మేలు చేకూరిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. వీఆర్వో సత్యనారాయణ,రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖో–ఖో క్రీడాకారునికి సత్కారం



ఖో–ఖో క్రీడాకారుడిని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): ఖో–ఖో పోటీల్లో రజత పతకాన్ని కైవసం చేసుకున్న రాష్ట్ర జట్టు సభ్యుడిని శనివారం అచ్యుతాపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సత్కరించింది. ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో అనకాపల్లి జిల్లాకు చెందిన శ్యాం ప్రసాద్ నాయకత్వంలో ఏపీ జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకొంది. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ఎస్.రాయవరం: స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి మాలధారణ భక్తులు మొక్కులు చెల్లించుకుని సమారాధన నిర్వహించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కంటి మీద కునుకు లేదు...



పైలా లక్ష్మి ఇంటి తలుపులు పగుల గొట్టి వస్తువులు చిందర వందర చేసిన దృశ్యం



ఒడ్డిమెట్టలో లూటీ చేసిన నర్సింగరావు కిరాణా షాపు

- వారం వ్యవధిలో నాలుగు చోరీలు
- రూ.10 లక్షల విలువైన ట్రాక్టర్ అపహరణ
- కిరాణా షాపులో లక్ష నగదు లూటీ
- భయం గుప్పెట్లో ఒడ్డిమెట్ట
- సమీప గ్రామాల్లోనూ చోరీల జోరు

నక్కపల్లి : మండలంలో ఒడ్డిమెట్ట గ్రామంలో వరుస చోరీలతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ గ్రామంలో నాలుగు ఇళ్లల్లో ప్రాంతాల్లో చోరీలు జరగడం గ్రామస్తులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో ఈ నెల 17వ తేదీన పైలా కృష్ణంరాజుకు చెందిన సుమారు రూ.10లక్షల విలువైన ట్రాక్టర్, తొట్టె చోరీకి గురైంది. ఈ ఘటన నుంచి తేరుకోకముందే గ్రామం నడిబొడ్డున ఉన్న నర్సింగరావుకు చెందిన కిరాణాషాపును ఈనెల 21వ తేదీన దొంగలు లూటీ చేశారు. షాపులో ఉంచిన సుమారు లక్ష రూపాయల నగదు ఎత్తుకుపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపాడు. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే 23వ తేదీన గ్రామానికి చెందిన పైలా లక్ష్మి ఇంట్లోనూ, ఆ మరుసటిరోజు పైలా తాతాజీ ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు దొరక్కపోవడంతో వస్తువులన్నీ చిందర వందరగా పడేసారని బాధితులు తెలిపారు. తాజాగా మంగళవారం రాత్రి నలుగురు అపరిచిత వ్యక్తులు గణపతి ఆలయం మెట్ల వద్ద ఉన్న ఇళ్లల్లో ప్రవేశించడానికి సిద్ధపడుతుండగా గ్రామస్తులు చూసి వెంబడించడంతో ఉడాయించారు. వారం రోజుల వ్యవధిలో ఇలా ఒకే గ్రామంలో వరుసగా నాలుగు చోట్ల దొంగతనాలు జరగడం గ్రామస్తులను కలవరపరుస్తోంది. చోరీలకు భయపడి గ్రామస్తులు అర్ధరాత్రి వరకు మేల్కొని ఉంటూ గ్రామంలో కాపలా ఉంటున్నట్టు గ్రామానికి చెందిన పైలా నూకన్న నాయుడు తెలిపారు. రాత్రిపూట నిక్కర్లు ధరించిన ఐదు నుంచి ఆరుగురు వ్యక్తులు గ్రామంలోకి వస్తున్నారని ఎవరైనా గుర్తించి వెంటబడితే పారిపోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

సమీప గ్రామాల్లోనూ...

ఇదే విధంగా ఇటీవల కాలంలో చుట్టు పక్కల పల్లెల్లోనూ చోరీల బెడద పెరిగింది. దేవవరం జంక్షన్‌లో రోడ్డు పక్కన పార్క్ చేసిన మోటారు సైకిల్‌ను దుండగులు ఎత్తుకు పోయారు. నక్కపల్లిలో రెండు మాసాల క్రితం రెండు ఆటోలు, మూడు మోటారు సైకిళ్లు దుండగులు ఎత్తుకు పోయారు. రేబాకలో కూడా ఆటో చోరీకి గురయింది. ఉద్దండపురం నుంచి గుల్లిపాడు వెళ్లే రోడ్డు మధ్యలో ఒక మహిళను బెదిరించి మెడలో నాలుగు తులాల బంగారు వస్తువులు ఎత్తుకు పోయారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంటోందని పగటిపూట రెక్కీలు నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారంటూ పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఆయా ఘటనలపై ఎస్ఐ విభీషణరావు వద్ద ప్రస్తావించగా తాను రెండురోజుల క్రితమే బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదులపై వివరాలు తీసుకుని దర్యాప్తు చేపడతామన్నారు.

అపరిచిత వ్యక్తులపై సమాచారం ఇవ్వండి

చోరీ ఘటనలు జరిగినపుడు బాధితులు తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. జాతీయ రహదారితో పాటు, తరచూ దొంగతనాలు జరుగుతున్న గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తాం. గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేస్తాం. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. అలాగే దూరప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ విలువైన వస్తువులు జాగ్రత్త పరుచుకోవాలి.

–ఎస్ఐ విభీషణరావు

చరిత్రాత్మకం ఆరోగ్య సురక్ష కార్యక్రమం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం
- విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేనంత విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని చెప్పారు. ఈ సందర్భంగా శనివారం పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహానేత వైఎస్సార్ హయాంలో 108 104, ఆరోగ్య శ్రీ వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యోగం, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. యలమంచిలి నియోజకవర్గంలో సోమలింగపాలెం, పెదపల్లి రేగుపాలెం, సీహెచ్‌సీ, నాలుగు మండలాల్లో కొత్త ఆస్పత్రులు కట్టించామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 106 రకాల మందులు అందుబాటులో ఉంచి వారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఇప్పటివరకు 69 సచివాలయాల్లో 26,472 మంది రోగులు వైద్యం చేయించుకున్నారని, 970 మందికి అత్యవసర వైద్య సేవలు నిమిత్తం పెద్దాసుపత్రులకు రిఫర్ చేశామని తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న సురక్ష కార్యక్రమం తన నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తయిందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. దుప్పితూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. నియోజక వర్గంలో ఏటికొప్పాకలో తొలి శిబిరం నిర్వహించామని తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలోనూ నిర్వహించిన శిబిరంలో అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. ఒక్కో సచివాలయం పరిధిలో 400 నుంచి 500 వరకూ ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారని, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి 105 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు,కూండ్రపు విమలనాయుడు, కోన బుజ్జి పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత పొలమరశెట్టి సత్య జగ్గారావు పేర్కొన్నారు. ప్రణాళికాపరంగా చదువుకోవాలన్నారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్లో ఆయన శనివారం విద్య ద్వారా కలిగే ప్రయోజనాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

యలమంచిలి(అనకాపల్లి రూరల్): కోరం లేకపోవడంతో శనివారం జరగాల్సిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది.శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. 25 మంది వార్డు కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులున్న యలమంచిలి పురపాలక సంఘం పాలకవర్గంలో 24 మంది అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన సభ్యులే ఉన్నారు. చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, 23వ వార్డు సభ్యుడు (టీడీపీ) మజ్జి రామకృష్ణ మినహాయిస్తే మిగిలిన వారెవరూ మధ్యాహ్నం 12 గంటలు దాటినప్పటికీ సమావేశానికి హాజరుకాలేదు. దీంతో కోరం చాలక సమావేశం వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ రమాకుమారి ప్రకటించారు. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే కౌన్సిలర్లంతా సమావేశానికి వచ్చారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కార్యాలయంలో సమావేశం పూర్తయ్యాక కౌన్సిల్ సమావేశానికి వచ్చామని కౌన్సిలర్లు తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : రామాయణం జీవన సంస్కారాన్ని నేర్పే మహాకావ్యం అని స్థానిక మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ అన్నారు. శనివారం వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మండల వనరుల కేంద్రంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్కృతభాషలో రామాయణాన్ని రచించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అమ్మానాన్నల అనురాగం, పుత్రులపై అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, ధర్మఫలం, స్నేహఫలం, గురుభక్తి, శిష్యానురక్తి, మొదలైన జీవిత పార్శ్వాలెన్నింటినో రామాయణం ద్వారా అందించారన్నారు. వాల్మీకి అసలు పేరు ప్రాచేతసుడన్నారు. ఉపాధ్యాయుడు ఆచార్యులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఝాన్సీ, శివ జగదీష్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ జాబితా

పాయకరావుపేట : మండలంలో గల రైతులకు సంబంధించిన ఈ క్రాప్ జాబితాను ఆయా గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాల్లో పెట్టడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు.త్వరలోనే రైతులు జాబితాల పై గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జాబితాలో ఏవిధమైన మార్పులు చేర్పులు వుంటే సవరణ కోసం ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు.



మంగవరం రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించిన రైతుల జాబితా

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఈక్రాప్ జాబితాలపై గ్రామసభలను నిర్వహించారు. ఈ జాబితాల్లో అభ్యంతరాలున్నా లేదా ఇంకా ఎవరి వివరాలైనా నమోదు కాకపోయినా నమోదు చేసేందుకు ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నామని ఏవో సుమంత తెలిపారు. రైతులు ఈ జాబితాల్లో తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

ఉపాధి పనులకు గ్రామసభలను వినియోగించుకోవాలి

మునగపాక : ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి ఆస్కారం కలుగుతుందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ అన్నారు. వెంకటాపురంలో ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో వచ్చిన పనులకు ఆమోదం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, డ్రైనేజీలు, చెరువులు, కాలువలు వంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఏపీవో ఎరకయ్య మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టబోయే పనులకు ప్రజల నుంచి ఆమోదం కోరుతున్నామన్నారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను జిల్లా కలెక్టర్‌కి పరిపాలనా ఆమోదం కోసం పంపుతామన్నారు. పనుల గుర్తింపులో సాంకేతిక పరమైన అంశాలను ఈసీ సంధ్య పర్యవేక్షిస్తారన్నారు. పనులు కావాలనుకునే వారు గ్రామసభల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం,పంచాయతీ కార్యదర్శి మోహిని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక : మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. ఒంపోలు(ఓసీ జనరల్), అరబుపాలెం (బీసీ మహిళ), చెర్లోపాలెం(ఓసీ మహిళ),తోటాడ(బీసీ జనరల్), మెలిపాక(ఓసీ జనరల్), రాజుపేట (బీసీ జనరల్), మునగపాక(ఎస్సీ జనరల్–1, ఎస్సీ మహిళ–1, బీసీ మహిళ–1), వాడ్రాపల్లి బీసీ జనరల్–2) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 01-01-2023 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సున్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 29, 30 తేదీల్లో దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీలుగా నిర్ణయించామన్నారు. నవంబర్ 1న ఇంటర్వ్యూలు మండల పరిషత్ హాలులో నిర్వహిస్తామన్నారు. ఎంపిక కాబడిన వలంటీర్లకు నవంబర్ 3న నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పురపాలక సంఘంలో 25 వార్డుల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరావు శనివారం మధ్యాహ్నం కమిషనర్ కొండలరావును కోరారు. తమ వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని కమిషనర్‌ను కోరారు. పారిశుధ్యం, వీధి లైట్లు, తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్లు కర్రి లక్ష్మి, పండూరి హరినాథ్, తుమ్మపాల శ్రీనివాసరావు, కోరిబిల్లి లక్ష్మి, సీర సాయి ప్రసన్న, పడాల కావ్య, పిట్టా సత్తిబాబు, దాసరి చిన్నమ్ములు, అచ్యుతరావు, మరిణేశ్వరావు, కో ఆప్షన్ సభ్యులు నరసింహమూర్తి, ప్రగడ రమణ, షేక్ సయ్యద్ బీబీ పాల్గొన్నారు.

పరారైన రిమాండ్ ఖైదీ కోసం తీవ్ర గాలింపు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ఎస్కార్ట్ పోలీసుల కళ్లు గప్పి పరారైన రిమాండ్ ఖైదీని పట్టుకోవడానికి జిల్లా క్రైం విభాగం ఏఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం విశాఖ సెంట్రల్ జైలు నుంచి యలమంచిలి కోర్టులో వాయిదా కోసం ఎస్కార్ట్ పోలీసులు రిమాండ్ ఖైదీ పిల్లా నూకరాజు (31)ను తీసుకువచ్చారు. యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద టాయ్‌లెట్‌కు వెళ్తానని చెప్పి, ఎస్కార్ట్ పోలీసుల కళ్లు గప్పి శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో పరారైన విషయం తెలిసిందే. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నూకరాజును ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఈ నెల 14న ఎస్.రాయవరం పోలీసులు అరెస్ట్ చేసి, విశాఖ సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 27న శుక్రవారం యలమంచిలి కోర్టులో వాయిదా నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చడానికి తీసుకొస్తుండగా నిందితుడు పరారయ్యాడు. పరారైన రిమాండ్ ఖైదీని పట్టుకోవడం కోసం విస్తృతంగా గాలిస్తున్నామని పట్టణ ఎస్ఐ పాపినాయుడు చెప్పారు. ఎస్కార్ట్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డెక్కన్ కెమికల్స్ సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే బాబూరావు
- నూతన తహసీల్దార్ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం



నూతన తహసీల్దార్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : మండల పరిషత్ ఆవరణలో నూతనంగా పునఃనిర్మించిన తహసీల్ధార్ భవనాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు శనివారం ప్రారంభించారు. డెక్కన్ ఫైన్ కెమికల్ ప్రైవేటు లిమిటెడ్ రూ.45 లక్షల సౌజన్యంతో ఈ భవనం పునఃనిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం మండలంలో చేస్తున్న సామాజిక సేవ, సహకార కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మండల ప్రజలు తరపున, ప్రభుత్వం తరపున డెక్కన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు గ్రామాల్లో సచివాలయాలు నిర్మాణం, ఆర్‌బీకేల నిర్మాణం, వెల్‌నెస్ సెంటర్లు, నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందన్నారు. అంతకుముందు కార్యక్రమం తహసీల్దార్ భవనం శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో డెక్కన్ కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు, పాయకరావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గారా ఉషశ్రీ ప్రసాద్, జగతా భవానీ శ్రీనివాస్, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, డెక్కన్ కంపెనీ ప్రతినిధులు సూర్యనారాయణరాజు, కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్ధార్ కె.నూకరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా నిరంతరం వైద్యసేవలు

- ఎమ్మెల్యే బాబూరావు



ఎమ్మెల్యే బాబురావుకు స్థానిక సమస్యలు వివరిస్తున్న ఎంపీటీసీ రమణ

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరంతరం వైద్య సేవలు అందించడం జరుగుతుందని, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శనివారం దోసలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన బాబూరావుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబూరావు శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతూ మారు మూల పల్లెలకు ఈవైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లోనే వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈవైద్య సేవలు నిరంతరం కొనసాగుతాయన్నారు. జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దోసలపాడు, చీడిక, చీడిక కొత్తూరు గ్రామాల నుంచి సుమారు 400 మంది ఈ శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. ఎంపీటీసీ సభ్యుడు పక్కుర్తి రమణ స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీటీసీ సభ్యుడు పక్కుర్తి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ దృష్టికి రామగిరి ఆలయం దుస్థితి



రామగిరిలోని సీతారామచంద్రమూర్తి ఆలయాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఆలయ అధికారి శర్మ

మునగపాక : రామగిరిలోని సీతా రామచంద్రమూర్తి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఏళ్ల తరబడి ఆలయం శిథిలావస్థకు గురైంది. దీంతో భక్తులు సీతా రామచంద్రమూర్తులను దర్శించుకునేందుకు అవస్థలు పడేవారు. సరైన నడక మార్గం లేక దర్శనాలకు వచ్చే వారు ఇబ్బందులు పడేవారు. ఏటా జనవరిలో కనుమ పండగను ఘనంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. వేలాదిగా భక్తులు పలు ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చి దర్శనాలు చేసుకుంటారు. ఇంత గుర్తింపు ఉన్న ఆలయం శిథిలావస్థకు గురికావడంతో భక్తులు ఆవేదనకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి స్పందించారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆలయాధికారి శర్మ శనివారం రామగిరిలోని శిథిలావస్థకు గురైన సీతా రామచంద్రమూర్తి ఆలయాన్ని సందర్శించారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని శర్మ స్థానికులకు తెలిపారు.


550 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు

పాయకరావుపేట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వెంకటనగరం గ్రామంలో 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించగా వెంకటనగరం, రాజనగరం గ్రామాలకు చెందిన 550 మంది వైద్య సేవలు పొందారు. ముఖ్యంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, పల్స్, టైఫాయిడ్, మలేరియా పరీక్షలు చేశారు. గుండెకు సంబంధించిన సమస్యలు వున్న వారికి ఈసీజీ తీశారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సేవలు ఎలా అందుతున్నదీ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, కార్యదర్శి వై.సత్యనారాయణ, సర్పంచ్ వంకా వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

కత్తితో దాడి : ఇద్దరికి గాయాలు



గాయపడిన అప్పలకొండ, జయంత్

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : భూ వివాదానికి సంబంధించి ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి ఇద్దరిని గాయపరిచాడు. వివరాలివి. రాజాన అప్పలకొండ, అతని మనుమడు జయంత్ యలమంచిలి రామ్మూర్తినగర్‌లో నివాసం ఉంటున్నారు. పురుషోత్తపురంలో ఉన్న భూమికి సంబంధించి అప్పలకొండ, అతని సమీప బంధువు రాజాన కాశీ మధ్య వివాదం ఉంది. కోర్టులో వివాదాస్పద భూమి సుమారు అర ఎకరం అప్పలకొండకు దఖలు చేస్తూ ఇటీవల డిక్రీ ఇచ్చారు. దీంతో ఆ భూమిని చూసేందుకు మనుమడు జయంత్‌తో కలిసి శనివారం అప్పలకొండ పురుషోత్తపురం వెళ్లారు. ఆ సమయంలో తాళ్లమ్మ చెరువు వద్ద కత్తితో కాశీ తమపై దాడి చేశాడని బాధితులుతెలిపారు. ఈ ఘటనలో అప్పలకొండ తలకు తీవ్రగాయమవడంతో యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. తాతపై దాడి జరుగుతున్న సమయంలో అడ్డుకోవడానికి యత్నించడంతో కత్తి తగిలి జయంత్ చేతికి గాయమైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరోసారి నేవీ నిర్మాణ పనుల అడ్డగింత

రాంబిల్లి : పెదకలవలాపల్లి పరిధిలో శనివారం మరోసారి నేవీ ప్రహరీ పనులను రైతులు అడ్డుకున్నారు. తమ జిరాయతీ స్థలాల్లో పనులు చేస్తుండడంతో సర్వే చేయాలని, ఆ తర్వాత పనులు చేయాలని తాము కోరుతున్నట్టు మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు తెలిపారు.